క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి



భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి

మిడుతూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, ఎంఈఓ మౌలాలి అన్నారు. శుక్రవారం జలకనూరు గ్రామంలో పర్యటించి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. వంట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం తనిఖీ చేసి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి హసీనా పాల్గొన్నారు.

వలంటీర్ నియామకానికి నేడు ఇంటర్వ్యూ

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం 1 సచివాలయం పరిధిలో వలంటీర్ నియామకానికి శనివారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి దరఖాస్తుదారులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటల్లోగా హాజరు కావాలని సూచించారు.

సుంకేసులలో నేడు గడప గడపకు ..

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆర్థర్ హాజరవుతారని, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

భద్రావతి భావనారాయణ స్వామికి పుష్పార్చన

నంద్యాల(వ్యవసాయం): పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి భావ నారాయణ కల్యాణ మండపంలో శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకొని రెండో రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు సామూహిక పుష్పార్చన చేపట్టారు. అనంతరం విష్ణు సహస్ర నామం పఠించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ 28వ తేదీన భద్రావతి భావ నారాయణ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన జరిపించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

మిడుతూరు: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ పీరునాయక్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని తలముడిపి, అలగనూరు గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధికబడులు సాధించేందుకు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. అనంతరం మొక్కజొన్న పైరును పరిశీలించి సాగు పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్వేత, నూరిన్నీసా, ఎంపీఈఓ సరస్వతి, రైతులు పొలగ్గారి స్వామిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, చిన్న రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిషియన్లను ఆదుకోవాలి

వెలుగోడు: ఎలక్ట్రీషియన్ వర్క్‌పై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఎలక్ట్రీషియన్ డేను పురస్కరించుకుని మండలకేంద్రం వెలుగోడులో డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.అంతకు ముందు వారు పట్టణంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్లు పి. అబ్దుల్ ఘనీ, బి. మహమూద్, బి.సుధాకర్, బి. కలిముల్లా, ఎస్.కలిముల్లా, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మహానంది: మహానంది గిరిజన ఆశ్రమపాఠశాల విద్యార్థులు సుమంత్, ఈదన్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అంబమ్మ శుక్రవారం తెలిపారు. ప్రకాశం జిల్లా దొనకొండలో శనివారం నుంచి జరుగనున్న పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఉపాధ్యాయులు క్రీడా పోటీలకు ఎంపికై న విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠశాలలో అభినందించారు.

మరోసారి ఆశీర్వదించండి

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ నామరూపాల్లేకుండా పోవడం ఖాయం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్



దివ్యాంగుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని 2 వార్డు కుర్వపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రతో టీడీపీకి ఒరిగేదేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోవటం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో బడుగు, బలహీన వర్గాల సమస్యలు కళ్లారా చూసి, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సిఫారసుల అవసరం లేకుండా అర్హులైన వారందరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన అమలు చేస్తున్న పథకాలే వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయన్నారు. తమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిందన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన అన్ని రకాల సేవలను సకాలంలో అందించాలని సూచించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లను అర్హులైన లబ్ధిదారులందరికీ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలరు జాకీర్ హుసేన్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ షకూర్ మియ్య, సహకార సొసైటీ చైర్మన్ హుసేనయ్య, మాజీ కౌన్సిలర్ దేశెట్టి శ్రీనివాసులు, ఎంఈఓ ఫైజున్నిసా, వైఎస్సార్సీపీ నాయకులు జాన్, విక్టర్, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి వనజాక్షి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవా వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ వాహనాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. అవసరమైన పశుపోషకులు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేస్తే ఇంటి వద్దకే వచ్చి సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ రామాంజనేయులు, వెటర్నరీ ఏడీలు రామాంజినాయక్, వరప్రసాదు, మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్‌హుసేన్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షకూర్‌మియ్య, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, సహకార సొసైటీ చైర్మన్ హుసేనయ్య, మాజీ కౌన్సిలర్ దేశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పాఠశాల తనిఖీ

ఐదో తరగతి విద్యార్థులు జాతీయగీతం సక్రమంగా చెప్పలేకపోతున్నారని, దీనిని బట్టి మీరు పాఠశాలల్లో చదువులు ఎలా చెబుతున్నారో అర్థమవుతుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం కుర్వపేటలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఆయన ఐదు తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. కొందరు వారాలు, నెలల పేర్లను సక్రమంగా చెప్పలేకపోయారు. మరికొందరు జాతీయగీతం చెప్పలేకపోయారు. దీంతో ఎమ్మెల్యే ఉపాధ్యాయుల విద్యాబోధనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ ఫైజున్నిసాను పిలిచి పాఠశాలలను తరుచుగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు సరిగ్గా విద్యాబోధన చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు శ్రీశైలంలో సూర్యారాధన

శ్రీశైలంటెంపుల్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీశైల ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠిస్తారు. అనంతరం కలశస్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపిస్తారు. కార్యక్రమంలో భాగంగా సూర్య మంత్రపూజ, సూర్యనమస్కారాలు, అరుణపారాయణం, వేదపారాయణం జరిపిస్తారు.

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

పగిడ్యాల: 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ పుల్లయ్య పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పంచాతీలు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలు చేయాలన్నా రు. రోజువారీగా వసూలైన ఇంటి పన్ను నగదు ను ట్రెజరీలో జమ చేయాలని ఆదేశించారు. అ లాగే జగనన్న ఆదర్శ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించి నివేదికలు అందించాలన్నారు.

భ్రామరీకి ఊంజలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ ఈఓ లవన్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించారు. సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించి అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



బండిఆత్మకూరు ఎంపీడీఓను సన్మానిస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఉత్తమ అధికారిగా వాసుదేవ గుప్తాకు గణతంత్ర దినోత్సవం రోజు అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యాలయ సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ఆయా పథకాలను అర్హులకు అందించాలన్నారు.

మిడుతూరు: మిడుతూరు వైఎస్సార్ క్రాంతి కార్యాలయంలో సీసీగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డికి ఉత్తమ పురస్కారం లభించడం హర్షణీయమని తహసీల్దార్ సిరాజుద్దీన్, ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ డేగలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో సీసీ కృష్ణారెడ్డికి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బయ్య, ఏఓ దశరథరామయ్య, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసులు, సీసీలు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్రమణ్యం

ఆత్మకూరు: అతివేగం ప్రమాదకరమని, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి డ్రైవింగ్ చేయాలని ఆత్మకూరు సీఐ సుబ్రమణ్యం, ఆర్టీసీ డిపో డీఎం మహేంద్రుడు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం నిర్వహించిన అవగాహ న కార్యక్రమంలో వారు మాట్లాడారు. వాహ నాలు నడిపేటప్పుడు డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు.రహదారి వెంట ఉన్న ట్రాఫిక్‌ను గమనిస్తూ ముందుకు సాగాలన్నా రు. ప్రధాన కూడళ్లు, స్పీడ్ బ్రేకర్ల వద్ద నిదానంగా వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కోటయ్యనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

జూపాడుబంగ్లా: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని నందికొట్కూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు, టౌన్ సీఐ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు ఆర్టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించటం క్షేమకరమన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్వీ రమణ, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మిడుతూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడుమూరులో గ్రామ సచివాలయం, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. లేకపోతే రోగాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వేసవికాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రంలో తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణ్ సింగ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశ్వరుడి దంపతులు



శ్రీగంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఊరేగింపు దృశ్యం

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. తర్వాత ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు.

పెండింగ్ అప్లికేషన్లను ఆమోదించాలి

కర్నూలు (న్యూటౌన్): జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన ఆమోదింపజేసి పూర్తి చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ అప్లికేషన్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న చేదోడు మూడవ విడత సాయాన్ని ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. కావున లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన ఆమోదింపజేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 29 గ్రామాల్లో 180 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ పథకం కింద టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి విశేషపూజలు నిర్వహించారు. ముందుగా లోకకల్యాణం కోసం అర్చకస్వాములు సంకల్పం పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అష్టోత్తరము, స్తోత్రము, పారాయణలు చేశారు.

వెండి పడిగె బహూకరణ

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 21 కేజీల వెండి నాగ పడిగెను భక్తులు అందించినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన శనివారపు వెంకటరామిరెడ్డి, శనివారపు దస్తగిరిరెడ్డి, ఆయన కుమారుడు శనివారపు కొండారెడ్డి, శ్వేత దంపతులు స్వామి వారికి వెండి పడగతో పాటు 30 గ్రాముల బంగారు కళ్లు, మీసం బహూకరించారన్నారు.

మహిళకు గాయాలు

ఆత్మకూరు: బస్సు ఢీకొని ఆత్మకూరు మండలం బాపనంతాపురం గ్రామానికి చెందిన మహిళ ఉమాదేవికి గాయాలయ్యాయి. ఈమె స్వగ్రామం నుంచి కర్నూలుకు వెళ్లేందుకు శుక్రవారం ఉదయం ఆత్మకూరుకు చేరుకుంది. బస్టాండ్ ఆవరణలో బస్సు కోసం ఎదురుచూస్తుంది. ఈక్రమంలో స్థానిక డిపోకు చెందిన బస్సు ఆమెను ఢీకొనడంతో రక్తగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రురాలిని స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం అదుపు తప్పి..

ఓర్వకల్లు: కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై ఓర్వకల్లు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి ఒంటిమిట్టకు ఏపీ 25 ఏసీ 5928 నంబర్ గల కారులో కొంత మంది బయలుదేరారు. నంద్యాల నుంచి కర్నూలుకు ఏపీ 21 బిజీ 3778 నంబర్ గల తవేరా ప్యాసింజర్ వాహనంలో కొందరు ప్రయాణికులు వస్తున్నారు. మార్గమధ్యలో ఓర్వకల్లు వద్ద ఫ్లైఓవర్‌పై బర్రెలు అడ్డు రావడంతో ఒంటిమిట్టకు వెళ్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌పై కొంత దూరం వెళ్లింది. అదే సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని శ్రీనివాసులు, జ్యోత్స్న, కనికె వెంకటేశ్వర్లు, మల్లకంటి ఈరమ్మ, మఠం మహేశ్వరమ్మ, నిల్లిబండ సుధాకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

నంద్యాల(అర్బన్): ప్రత్యేక హోదా, విభజన హామీలను మరిచిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని విభజన హామీల సాధన కమిటీ చైర్మన్ చలసాని శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన సమరయాత్ర శుక్రవారం నంద్యాలకు చేరింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సమరయాత్ర నాయకులు డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చలసాని మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, సమరయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక హోదా ఇచ్చి రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న పాల్గొన్నారు.

శ్రీశైలదేవస్థాన పథకాలకు విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు శుక్రవారం కర్ణాటకకు చెందిన భక్తులు విరాళాలు అందించారు. అన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన సి.పుష్పలత రూ.1,00,116 , గోసంరక్షణనిధి పథకానికి సి.నరసింహులు రూ.1,00,116 చొప్పున అందించారు. దాతలను దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్య ప్రదర్శన



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. నందికొట్కూర్‌కు చెందిన సాయిలిక్షిత శ్రీ, లిక్షిత శ్రీ నృత్యకళాశాల కళాకారులు మహాగణపతిమ్, శివాశివాష్టకం, శివ తాండవం, శివస్తుతి, శంభోశివ శంభో తదితర భక్తి గీతాలకు నృత్యప్రదర్శన చేశారు.

పాఠ్యాంశంగా పార్వేటోత్సవం

- 7వ తరగతి విద్యార్థులకు పాఠంగా అహోబిలేశుడి విశిష్టత



పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులు



పాదరక్షలు లేకుండా పల్లకీ మోస్తున్న బోయిలు

రుద్రవరం: ప్రపంచంలోని 108 దివ్య క్షేత్రాల్లో నవ నారసింహులు కొలువైన అహోబిల క్షేత్రం ఒకటి. ఏటా సంక్రాంతి పర్వదినం మరుసటి రోజున ఉత్సవ మూర్తులైన శ్రీ జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వామి వారు పల్లకీలో కొలువై అహోబిలం నుంచి పార్వేటకు బయలు దేరడం ఆనవాయితీగా సాగుతోంది. పార్వేట మహోత్సంలో ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు కలిగినందుకే ప్రభుత్వం 7వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశంగా చేర్చింది.

పార్వేట ఇలా..

హిరణ్యకశపుడిని వధించిన అనంతరం స్వామి వారు ఉగ్రరూపంతో కొండలు కోనల్లో తిరుగాడేవారు. ఆ రూపం నుంచి స్వామిని శాంతింపజేసేందుకు దేవతలు చేసిన ప్రయత్నంలో భాగంగా లక్ష్మీదేవి చెంచులక్ష్మిగా అవతరించి అహోబిలం అడవుల్లో తిరుగాడుతున్న ఉగ్రనారసింహుడికి తారసపడతారు. అమ్మవారిని చూసిన స్వామి వారు ఆమెను వివాహమాడాలని నిశ్చయించుకోగా.. చెంచులు తమ తోబుట్టుని పెళ్లాడలంటే వోలి (సుంకం) చెల్లించాలని పట్టుబడతారు. తన వద్ద ఏమి లేదని.. బయటకు వెళ్లి తీసుకొస్తానని స్వామి వారు చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి ధన ధాన్యాలు సేకరించుకొని, అహోబిలంలో జరిగే తమ కల్యాణానికి అందరూ తరలి రావాలని ఆయా గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చి తిరిగి వస్తారు. అలా స్వామి వారు వెళ్లి రావడమే పార్వేటగా మారిందనేది స్థానిక పురాణం

పూజల్లో అగ్రస్థానం చెంచులకే..

చెంచుల తోబుట్టువు అయిన చెంచులక్ష్మి అమ్మవారిని కల్యాణమాడే వరకు జరిగే పూజల్లో అగ్రస్థానం చెంచులకే కేటాయించారు. పార్వేటకు ముందు అహోబిలంలోని రెండు కాలనీల చెంచులు అడవికి వెళ్లి ఆకులు సేకరించి తోరణాలుగా కూర్చి ఎగువ,దిగువ ఆలయాలను అలంకరిస్తారు. రాత్రి ఉత్సవమూర్తులు పార్వేటకు బయలు దేరే ముందు వారు ఆలయానికి చేరుకొని నృత్యాలు చేస్తు అందరిని అలరించిన అనంతరం స్వామి వారికి మొదటి పూజ చేసి సాగనంపుతారు. అలాగే బ్రహ్మోత్సవాల పూజల్లోను వారికి ప్రథమ స్థానం ఇచ్చారు.

నియమ నిష్టలతో..

బోయీలు నియమ నిష్టలతో స్వామి వారి పార్వేట పల్లకీని మోస్తున్నారు. పల్లకీ మోసే వారు పార్వేటోత్సవం పూర్తయ్యే వరకు పాదరక్షలు ధరించరాదని నియమం. అలాగే వ్యసనాలకు దూరంగా ఉండాలి. అహోబిలం నుంచి బయలుదేరిన 40 రోజుల పాటు పర్యటించడంతో స్వామి వారు అలిసి పోతారు. ఆ అలసటను పోగొట్టేందుకు అర్చక బృందం మూడు చోట్ల అభిషేకం (వస్త్రమార్పిడి) చేస్తారు. మొదటి విడత ఉయ్యాలవాడలో స్వామి పులకాపం చేసి పట్టు వస్త్రాలు పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. టీ.లింగదిన్నె,రుద్రవరం గ్రామాల్లో మరోసారి పులకాపం చేస్తారు. గతంలో నైవేద్యం గ్రామాల్లోని బావుల నుంచి నీటితో అక్కడే వండి స్వామి వారికి సమర్పించే వారు. ప్రస్తుతం బావులు లేకపోవడంతో అహోబిలం నుంచి తీసుకొస్తున్నారు.

గ్రామాల్లో పండుగ వాతవరణం..

స్వామి వారి పల్లకీ వెళ్లిన గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడుతాయి. ముఖ్యంగా ఆడపడుచులను ఆహ్వానించడం ఆనవాయితీ. స్వామి వార్లకు పిండివంటలతో నైవేద్యం సమర్పించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా గ్రామంలో దుకాణాలు, రంగు రాట్నాలు వంటివి వెలుస్తాయి.

స్వామి వెంట పరివారం..

సంక్రాంతి పండుగకు నెల రోజులు ముందే ప్రకాశం జిల్లా గిద్దలూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాదాపు 50 కుటుంబాలు పెంపుడు జంతువులతో సహా అహోబిలానికి కాలినడకన బయలుదేరి వస్తారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు స్వామి వారి వెంటే ఉంటారు. గ్రామాల్లో పల్లకీతో పాటు వెళ్లి భిక్షమెత్తుకొని జీవనం సాగిస్తారు.